♦ కథ

# అనుభవం —— జయశ్రీ

ఘటర్జీ, నేనూ చాలా యేళ్ళ నుంచి మంచి స్నేహితులం. ఘటర్జీ ఉద్యోగరీత్యా వైజాగ్ వచ్చినప్పుడు మా యింట్లో ఓ రూమ్‌లో అద్దెకు వుండేవాడు. అతడికదే మొదటి ఉద్యోగం. ఓ పేరున్న ప్రయివేట్ కంపెనీలో సేల్స్ ఆఫీసర్ ఉద్యోగం. అసలే మంచి మాటకారి.

దానికితోడు బాగా మాట్లాడి యెదుటివారిని మెప్పించడం, వప్పించడం ఉద్యోగరీత్యా బాగా అవసరం. అతడి చాకచక్యంవల్ల వాళ్ళ కంపెనీ సేల్స్ వైజాగ్‌లోను, చుట్టుపక్కలా బాగా పెరిగాయి. అతడికి కూడా త్వరత్వరగా యింక్రిమెంట్లు వచ్చాయి.

మా యింట్లో అద్దెకు దిగిన కొద్ది రోజుల్లోనే మా యింటిల్లిపాదినీ బాగా ఆకట్టుకున్నాడు. నేనూ, అతడూ ఒకే వయసువారు కావడంతో మా యిద్దరి మధ్య స్నేహం మరింత ధృవపడింది. నాకు చాలా యిష్టమయినవీ, ప్రవేశం లేనివీ అయిన సంగీతం, పెయింటింగ్ అతడికి బాగావచ్చు. మంచి కవితావేశం వుంది. అలాగని యెప్పుడూ వాటిల్లో మునిగి వుండేవాడు కాదు. కానయితే యివన్నీ నాకు అతడిమీద 'హీరో వర్షిప్' పెరగడానికి దోహదం చేశాయి. అతడు వైజాగ్‌లో వున్న మూడేళ్ళూ మా యింట్లోనే వున్నాడు. ఆ మూడేళ్ళూ సాయంత్రాలు మహా హుషారుగా గడిచిపోయేవి. షికార్లూ, సినిమాలూ అన్నీ కలిసే.

మూడేళ్ళు వైజాగ్‌లో వున్నాక ప్రమోషన్ మీద అతడికి కలకత్తా ట్రాన్స్‌ఫర్ అయింది. అతడి సొంత వూరుకే ట్రాన్స్‌ఫర్ అయినందుకు సంతోషించినా, మమ్మల్ని వదలి వెళ్ళిపోతున్నందుకు మేమెంతో బాధపడ్డాం. మా అమ్మా నాన్న సొంత కొడుకు దూరంగా వెడుతున్నంతగా విచారించారు. నా సంగతి సరేసరి. ఇంకెక్కడివి ఆ సాహిత్య చర్చలు, రాజకీయాలపై వాదోపవాదాలు! అటువంటి అరుదైన సాన్నిహిత్యం మళ్ళీ యెప్పటికి?

కలకత్తా వెళ్ళినా ఘటర్జీ తరచూ ఉత్తరాలు వ్రాస్తూ వుండేవాడు. ఎప్పుడైనా ఆఫీసు పనిమీద వైజాగ్ వస్తే మా యింట్లోనే దిగేవాడు. నేనూ అంతే. ఎప్పుడైనా కలకత్తా టూరువెడితే అతడితోనే మకాం. మళ్ళీ పాత రోజుల జ్ఞాపకాలూ అవీనూ అతడి పెళ్ళికి స్వయంగా ఆహ్వానించడంతో మేమంతా కలకత్తా వెళ్ళాం. మమ్మల్ని చాలా గౌరవంగా చూశారు ఆడపెళ్ళివారు కూడా.

చాలా రోజుల తర్వాత, నేను ఆఫీసు పనిమీద కలకత్తా వెళ్ళవలసి వచ్చింది. అదీ సడెన్‌గా తగిలిందా ప్రయాణం. ఉత్తరం రాయడానికి టైమ్ లేక ఘటర్జీకి ముందుగా టెలిగ్రాం ఇచ్చాను ఫలానా ట్రయిన్‌లో వస్తున్నానంటూ. స్టేషన్‌కి కారు తీసుకొని వచ్చాడు. తిన్నగా అతడింటికివెళ్ళాం. అతడి భార్య పురిటికి పుట్టింటికి వెళ్ళడంతో ప్రస్తుతం వంటరిగానే వుంటున్నాడతను. స్నాన పానాదులయ్యాక నేను ఆఫీసు పని మీద వెళ్ళిపోయాను. ఘటర్జీ కూడా వాళ్ళ ఆఫీసుకి వెళ్ళిపోయాడు. అలసి సొలసి సాయంత్రం ఇంటికి చేరాను. నేను వెళ్ళిన కాసేపటికి ఘటర్జీ కూడా యిల్లు చేరాడు. స్నానం కానిచ్చి, కాఫీ టిఫిన్‌లు చేసి కబుర్లలో పడ్డాం. వైజాగ్ విశేషాలూ, అతనితో గడిపిన రోజులూ, కొత్త పుస్తకాలూ — ఒకటేమిటి ఆకాశం క్రిందున్నవన్నీ వకసారి చుట్టేశాం.


కలకత్తాలో వున్న ఆ మూడు రోజులు మరుపురాని మధురక్షణాల్లా గడిచిపోయాయి. శనివారం రాత్రి బయల్దేరాల్సిన నేను, వచ్చిన పని పూర్తి కాకపోవడంతో సోమవారం కూడా వుండాల్సి వచ్చింది. ఎలాగు వున్నాను కదాని శనివారం రాత్రి సినిమాకు వెడదామన్నాడు ఘటర్జీ. కొత్తగా రిలీజ్ అయిన ఇంగ్లీషు సినిమాకి. సరేనని యిద్దరం రాత్రి సెకండ్ షోకి వెళ్లాం. ట్రయిన్ టికెట్టు కాన్సిల్ చేసుకుని వెళ్లడంతో మేము సినిమా హాలు చేరేసరికి హౌస్‌ఫుల్. సినిమా మొదలయే టయిమ్ కావడంతో హాలు బయట అంతగా జనం లేరు. రెండు నిమిషాలు అటూ యిటూ

తిరిగి వచ్చేదామనుకుంటున్నాం. ఇప్పుడే వస్తానని ఘటర్జీ సిగరెట్స్ కోసమని వెళ్ళాడు. ఇంతలో ఓ యువతి వచ్చి నన్నడిగింది ఇంగ్లీషులో. 'టికెట్లు ఎక్స్ట్రాగా వున్నాయి తీసుకుంటారా' అని. 'ఇద్దరం వున్నామని చెప్పాను నేను. ఆమె రెండు టిక్కెట్లూ ఇచ్చింది. 'థాంక్స్!' అనీ చెప్పి డబ్బిచ్చేశాను. సిగరెట్సు కొనుక్కొని ఘటర్జీ వచ్చాడు. నేను చాలాగర్వంగా చెప్పాను టిక్కెట్లు సాధించాననీ. నెమ్మదిగా తెలుగులో చెప్పాను ఎలాగ దొరికినాయో. ఘటర్జీఏదో కామెంట్ చేయబోయి మాకు దగ్గర్లోనే ఆ అమ్మాయి వుండడంతో వూరుకున్నాడు. లోపలికి వెళ్ళి కూర్చున్నాం.

మేమున్న వరుసలో రెండు, మూడు సీట్లు మావి. మొదటి సీటు ఖాళీ. రెండో సీట్లో నేను కూర్చున్నాను. మూడో సీట్లో ఘటర్జీ కూర్చున్నాడు. లైట్లారి సినిమా మొదలయిన కాసేపటికి మాకు టిక్కెట్లు ఇచ్చిన యువతి వచ్చి నా ప్రక్కనే వున్న మొదటి సీట్లో కూర్చుంది. నా గుండె లిప్తపాటు ఆగి మళ్ళీ కొట్టుకోవడం మొదలు పెట్టింది. ఎంతయినా కుర్ర వయసు కదా! దానికితోడు మా ఆవిడ తప్ప పరాయిస్త్రీ ప్రక్కన వుండగా సినిమా చూడడమే యెరుగను నేను. సినిమా చూస్తున్నంత సేపూ ఘటర్జీ యేదో ఒకటి కామెంట్ చేస్తూనే వున్నాడు నెమ్మదిగా కానీ నాకవేమీ వినిపించడం లేదు. ఇంతలో నా పక్కన వున్న యువతి నా సీటు వైపుకి వొరిగింది. అలవాటు లేని పరిస్థితి కావడంవల్ల నాలో కొద్దిగా బెరుకు

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

మొదలయింది. కాసేపయిన తర్వాత ఆమె నాతో యేదో బెంగాలీలో అంది. సరిగ్గా అర్థంకాక యేమిటని? నేను హిందీలో అడిగాను. వెంటనే హిందీలో చెప్పింది "ఒక వంద రూపాయిలిమ్మని." దేనికని అడిగాను. "ఏమీ మాట్లాడకుండా వంద రూపాయిలియ్యి. లేకపోతే నాతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నావని గొడవ చేస్తాను" అని మళ్ళీ హిందీలో సమాధానమిచ్చిందామె. అంతే! నా ప్రాణాలు సగం పోయాయి. ఎంత అమాయకంగా, యిలాటి విపత్కర పరిస్థితులలో యిక్కు కున్నానోనని. చేతులారా కొని తెచ్చుకున్నానీ సంకటం. నేను ఆ అమ్మాయితో మాట్లాడడం, తర్వాత కొద్దిసేపటికీ బిగుసుకు పోవడం గమనించిన ఛటర్జీ అడిగాడు తెలుగులో ఏర్పుయిందని. నెమ్మదిగా



అతనికి ఆ అమ్మాయితో జరిగిన సంభాషణ వివరించాను. ఒక నిమిషం ఆలోచించి, యిలా అన్నాడు ఛటర్జీ. "వీలు చూసుకుని నేను లేస్తాను. బయటికి వెళ్ళేవాడిలా. నేను నీ సీటు దాటి ఆమె సీటు ముందుకు రాగానే నీవు నా సీట్లోకి వచ్చెయ్యి. నేను నీ సీట్లో కూర్చుంటాను. మిగతా విషయం నేను చూసుకుంటాను". నేను అలాగేనన్నాను. ఇంకో అయిదునిమిషాలకి ఛటర్జీ సీట్లోంచి లేచాడు. అనుకున్నట్టుగానే మేము సీట్లు మారాము – ఆ యువతి యేం జరుగుతోందో గమనించేలోగా. కాసేపటి తర్వాత ఆమె ఛటర్జీతో యేదో అంది హిందీలో. ఛటర్జీ బెంగాలీలో సమాధానమిచ్చాడు. డబ్బు ఇవ్వననీ, ఏం కావలసివస్తే అది చేసుకోమని. ఇంకోసారి బెదిరించిందామె. ససేమీరా ఇవ్వనన్నాడు ఛటర్జీ. తెరమీద మంచి ఫైట్లూ, రేప్‌సీనులూ అయిపోతున్నాయి. కానీ నా దృష్టి తెరమీద జరుగుతున్న సినిమా కన్నా, నా ప్రక్కన జరుగుతున్న సినిమా మీదే వుంది. ఈలోగా ఇంటర్వెల్ అయింది. లైట్లు వెలుగుతుండగా ఆమె నిజంగానే గొడవ చేయడం మొదలుపెట్టింది. అంతకంటే గట్టిగా అరుస్తూ బాగా జాలిగొలిపే గొంతుతో, చటర్జీ చుట్టూ మూగినవాళ్ళకి బెంగాలీలో చెప్పడం మొదలుపెట్టాడు. ఆమె తన భార్యనీ, కొద్దిగా మతి స్థిమితం లేని మనిషనీ, దగ్గరి చుట్టం కాబట్టి తెలిసీ చేసుకున్నాననీ! ఇంకా యిలా అన్నాడు – "ఈ మధ్య తగ్గినట్టుగా వుంటే సినిమాకు వచ్చాను.

కజిన్ రావడంవల్ల (నేనే ఆ కజిన్ అన్నమాట) సినిమాలో వయొలెన్స్ చూసి మళ్ళీ పాత ధోరణిలోకి వచ్చేసింది. ఇంకాసేపు పోతే నేను తన భర్తనే కాదన్నా అనవచ్చు" కన్నీళ్ళు పెట్టుకుమరీ చెప్పాడు. ఇదంతా చూస్తున్న నాకు, ఛటర్జీ ఇంట్లో షోకేసులో వున్న 'బెస్ట్ యాక్టర్' కప్పులు గుర్తుకు వచ్చాయి.

అతడి డ్రామా ఎక్స్‌పీరియన్స్, సేల్సు టాక్ అన్నీ బాగా వుపయోగించి కన్విన్సింగ్ అయ్యేలా చెప్పాడేమో అంతే. చుట్టుపక్కలున్న వాళ్ళు ఆమె యేమి చెప్తున్నా వినకుండా, దగ్గరుండి ఆమెని ఛటర్జీతో సహా కార్లోకి యెక్కించారు బలవంతంగా. నేను డ్రైవింగ్ సీట్లో. ఆమె ఒకటే గొడవ. సినిమా హాలు దాటి కొంతదూరం వచ్చాక ఆమెతో అన్నాడు ఛటర్జీ "మాకు రెండు వందలియ్యి. నిన్ను వదిలేస్తాం. లేకపోతే నాకు తెలిసిన పోలీసు స్టేషన్‌లో అప్పజెపుతాను నీ యిష్టం మరి" అని. ఆమె కాళ్ళ బేరానికి వచ్చింది. తప్పయిపోయిందని వప్పుకుంది. పొట్టకూటికోసం అలా చేశాను. మళ్ళీ ఇంకెప్పుడూ యిలాంటి పని చేయనంది. అలా బతిమిలాడితే, మళ్ళీ యిటువంటి పని చేయవద్దని వార్నింగ్ ఇచ్చి దార్లో దించేశాడు ఛటర్జీ. వదిలేసే ముందు మా రెండు టిక్కెట్ల డబ్బు వెనక్కి తీసుకొని మరీనూ. తర్వాత నాతో అన్నాడు. "నాకు నువ్వు టిక్కెట్లు తీసుకున్నప్పుడే అనుమానం వచ్చింది. నాకు చెప్పకుండా నువ్వు కొనేసావు. ఈ వూళ్ళో యిలాంటి ఘరానా మోసాలు చాలానే వుంటాయి. ఈమాటు జాగ్రత్త! ప్రతీసారీ ఈ ఛటర్జీ వుండడుగదా నీ ప్రక్కన. నువ్వే ఎలాంటి చిక్కు పరిస్థితి వచ్చినా సమయానుకూలంగా ప్రవర్తించి బయటపడాలి".

మొత్తానికి మరుపురాని అనుభవాన్ని మిగిల్చిందీ కలకత్తా ప్రయాణం.